# ప్రజల నిరసనను ఎదుర్కొనే పద్ధతేనా ఇది?

లాఠీలు విరుగుతున్నాయి. జనం చావు దెబ్బలు తింటున్నారు. కొందరికి ఎముకలు విరుగుతున్నాయి. కొందరికి మూతి పళ్లు రాలుతున్నాయి. విద్యుత్ చార్జీలు తగ్గించండి అని గొంతెత్తిన ప్రతీ ఒక్కరి నోరు నొక్కి, అవసరమైతే పీకనొక్కి తరిమికొట్టడానికి పోలీసులు వెనుకాడటం లేదు. పత్రికల్లో ఫోటోలు వస్తున్నాయి. టీవీలో ఆందోళనకారుల చొక్కాలు చించి బరబరా ఈడ్చుకెళ్లే క్లిప్పింగులు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం ఉలకడం లేదు పలకడం లేదు. పైపెచ్చు లాఠీచార్జీల గురించి ఇంతగా రాయడమెందుకని విలేకరులను విసుక్కుంటున్నది.

'ఈ చార్జీలు మేము కట్టలేము. అసలెందుకు కట్టాలి? అసలెందుకు పెంచారు' అని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై క్రూరంగా లాఠీచార్జి చేయడం అమానుషమే కాదు, చట్టవిరుద్ధం కూడా. ప్రభుత్వ విధానాల్లోని తప్పులను ఎత్తి చూపి వాటిని సరిదిద్దడానికి ప్రయత్నించడం ఏ ప్రజాస్వామ్యదేశంలోనైనా ప్రతిపక్షాల పనీ, బాధ్యతా. ఇప్పుడు విద్యుత్ చార్జీల విషయంలో తొమ్మిది కమ్యూనిస్టు పార్టీల కూటమిగానీ కాంగ్రెస్‌గానీ ఇతర ప్రజాసంఘాలుగానీ ఈ ప్రజాస్వామిక కర్తవ్యాన్నే నిర్వర్తిస్తున్నాయి.

కొత్త టారిఫ్‌తో వస్తున్న విద్యుత్ బిల్లులను జనం ఇప్పుడిప్పుడే అందుకుంటున్నారు. పాత బిల్లులతో కొత్త బిల్లులను బేరీజు వేసుకుంటే వాళ్ల గుండెలు గుభేలు మంటున్నాయి. ఇంచుమించుగా రెండింతలైన ఈ బిల్లులను కట్టడం ఎలా? అని స్వచ్ఛందంగానే అధికారుల ముందు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఘెరావ్‌లు చేస్తున్నారు. సమాధానానికి బదులు లాఠీ దెబ్బలు తింటున్నారు.పోలీసుల చేత కొట్టిస్తే చెడ్డపేరొస్తుందని చెప్పి ఇప్పుడు 'ప్రజలే వారిని కొడుతున్నారు' అని చెప్పడానికి తన పచ్చచొక్కా యోధులకు తెలుగుసేన అని పేరుపెట్టి ఆందోళనకారుల పైకి రెచ్చగొడుతున్నాడు చంద్రబాబు. 'నా మీదికి ప్రజలను ఎగదోసినప్పుడు మీ మీదికి నేనెందుకు ఎగదోయకూడదు' అని దబాయిస్తున్నాడు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడానికీ ఆందోళనకారులపైన దాడులు చేయడానికీ తేడా లేనట్టు మాట్లాడడం చంద్రబాబుకే చెల్లింది.

అసలు ఈ చార్జీలు ఎందుకు పెంచినట్టు? ఉన్నట్టుండి ఉత్పత్తి ఖర్చేమీ రెట్టింపవలేదు. అసలు విద్యుత్ సంస్థ నష్టాలకూ పెరిగిన చార్జీలకూ సంబంధమే లేదని సాక్షాత్తూ ఏపీఎస్ఇబి ఇంజనీర్లే చెపుతున్నారు. మరి ఎందుకు పెంచినట్టు? ఎందుకంటే ప్రైవేటు పెట్టుబడిదారుల లాభాలను కాపాడటానికి. ప్రపంచ బ్యాంకు ఆదేశాలను శిరసా వహించడానికి. ప్రజా సంక్షేమాన్ని విడనాడి ప్రైవేటు పెట్టుబడిదారుల లాభాలను కాపాడే దృక్పథాన్ని మన ప్రభుత్వం ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకు నాలుగు సంవత్సరాల క్రితమే స్వీకరించింది. నాలుగేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడైతే అప్పు కోసం ప్రపంచ బ్యాంకును ఆశ్రయించిందో అప్పుడే అది మన 'అభివృద్ధి'ని శాసించడం ఆరంభించింది. రాష్ట్రం వెనుకబడిపోయిందంటూ సత్వర ఆర్థికాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదించింది. ఆ ప్రతిపాదనల్లో ముఖ్యమైనదేమిటంటే-

''సబ్సిడీలపైన, జీతభత్యాలపైన ప్రభుత్వం చేస్తున్న ఖర్చును తగ్గించాలి. అలా ఆదా చేసిన సొమ్ముతో విద్యుత్, టెలికమ్యూనికేషన్స్ వంటి మౌలిక సదుపాయాలను పెంపొందించుకోవాలి. అప్పుడు ప్రైవేటు

## బహిరంగ సభ

**09-08-2000**

సాయంత్రం 6 గంటలకు

## స్థలం:

బాగ్‌లింగంపల్లిలోని

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో

## వక్తలు

కె.జి.కన్నబిరాన్
(పి.యు.సి.ఎల్. జాతీయ అధ్యక్షులు)

బి.వి.రాఘవులు
(సి.పి.ఎం. రాష్ట్ర కార్యదర్శి)

సురవరం సుధాకర రెడ్డి
(సిపిఐ రాష్ట్ర కార్యదర్శి)

కొణిజేటి రోశయ్య
(కాంగ్రెస్ అధికార ప్రతినిధి)

కె.బాలగోపాల్
(మానవహక్కుల వేదిక)

## అందరికీ ఆహ్వానం

పెట్టుబడులు పెరుగుతాయి. ఆర్థికాభివృద్ధి జరుగుతుంది''

1996 నాటికి రాష్ట్రంలో 6110 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉందని, 2002 నాటికి రాష్ట్రానికి మరో 8500 మెగావాట్ల విద్యుత్ అవసరం ఏర్పడుతుంది అని ప్రపంచబ్యాంకు అంచనా. అంటే 2002 నాటికి విద్యుత్ డిమాండ్ 14610కి చేరుకుంటుందని వారి భావన. అయితే ఈ డిమాండ్ ఇంతగా పెరుగుతుందనడానికి అధ్యయనాలు లేవు. పరిశోధనలూ లేవు. అంటే స్పష్టమైన ఆధారాలు లేకుండానే ప్రపంచబ్యాంకు ఈ బాధ్యతారాహిత్యమైన అంచనా వేసిందన్న మాట. అలా అంచనా వేయడమే కాకుండా దాని ఆధారంగానే విద్యుత్ విధానాలను సూచించింది. విద్యుత్ ఉత్పాదన పెంచడానికి 3500 కోట్లు అవసరమవుతాయని బ్యాంకు నిర్ధారించింది. అంత మొత్తం ప్రభుత్వం దగ్గర లేదు కాబట్టి ప్రైవేటు పెట్టుబడిదారులను అనుమతించాలని సూచించింది. అంతేకాకుండా వారు ఉత్పత్తి చేసే కరెంటును ప్రభుత్వం కొనుగోలు చేయాలని, వారికి లాభం కలిగే రీతిలో ఈ కరెంటు ధరలను నిర్ణయించాలని కూడా బ్యాంకు ఆదేశించింది. ఆ విధంగా లేని అవసరానికి అయ్యే భారాన్ని ప్రభుత్వం ఇప్పుడు చార్జీల రూపంలో ప్రజల నుంచి వసూలు చేస్తోంది. అంటే సొమ్ము ప్రజలది. సోకు ప్రయివేటు పెట్టుబడిదారులది కాబోతోంది.

కాసేపు ప్రైవేటు పెట్టుబడిదారులను అనుమతించడం అవసరమనుకుందాం. అప్పుడు వాళ్ల దగ్గర నుంచి విద్యుత్తు ఎంతకు కొనాలి? ఇప్పుడు కొంటున్న రేట్లు ఎంత? ఒకసారి బేరీజు వేసుకుందాం.

లెక్కలు: ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ఇతర పబ్లిక్, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి విద్యుత్‌ను ఇలా కొనుగోలు చేస్తోంది. జల విద్యుత్ - యూనిట్ *0.48* పైసల చొప్పున; థర్మల్ విద్యుత్ - యూనిట్ *1.93* పైసల చొప్పున ఎన్.టి.పి.సి నుంచైతే - యూనిట్ *1.64* పైసల చొప్పున; ఇతర రాష్ట్రాల నుంచైతే - యూనిట్ *2.05* పైసల చొప్పున.

కానీ-

ప్రయివేటు ఉత్పత్తిదారుల నుంచైతే- ఒక యూనిట్‌ను 2.52 పైసల నుంచి 5.20 పైసల వరకు చెల్లించి కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దీని వల్ల ప్రభుత్వ రంగ సంస్థల కంటే ప్రయివేటు రంగ సంస్థలకు 50% నుంచి 150% వరకు అధిక మొత్తాన్ని చెల్లించబోతున్నట్టు మనకు అర్థమవుతోంది. ఈ అధిక మొత్తం కోసమే ఇప్పుడు ప్రజల ముక్కు పిండి అధిక చార్జీలు వసూలు చేస్తున్నది.

రెగ్యులేటరీ కమిషన్‌కు చెప్పి వచ్చే ఏడాది నుంచి చార్జీలు తగ్గేలా చూస్తానని ముఖ్యమంత్రి అంటున్నారు. ఆ పని ఈ ఏడాది ఎందుకు చేయలేదో మాత్రం ఆయన చెప్పడం లేదు.

ఇలా కొద్దిమంది లాభాల కోసం అన్యాయంగా రేట్లను పెంచడమే కాకుండా విద్యుత్ చార్జీల పెంపును రాజకీయం చేయవద్దని ప్రభుత్వం ఎదురు ప్రజలనే దబాయిస్తున్నది. ముందుగానే రెగ్యులేటరీ కమిషన్‌తో చర్చించి ఉండాల్సిందని ప్రతిపక్షాలతో అంటున్నది. వాస్తవానికి చార్జీలు పెంచొద్దని కోరుతూ రెగ్యులేటరీ కమిషన్‌కు ఎన్నో సంఘాలు పిటిషన్లు సమర్పించాయి. వాటిని కమిషన్ పట్టించుకోలేదు. నిజానికి రెగ్యులేటరీ కమిషన్ సూచనల్ని ప్రభుత్వం తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం లేదు. ప్రజా సంక్షేమం కంటే ఏ నియమమూ ఎక్కువ కాదు. రెగ్యులేటరీ కమిషన్‌కు చెప్పి వచ్చే ఏడాది నుంచి చార్జీలు తగ్గేలా చూస్తానని ముఖ్యమంత్రి అంటున్నారు. ఆ పని ఈ ఏడాది ఎందుకు చేయలేదో మాత్రం ఆయన చెప్పడం లేదు.

ఇప్పటికైనా మించి పోయింది లేదు. లాఠీలతో బాది ప్రజాందోళనను అణచాల్సిన అవసరం లేదు. సమస్యను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించే ప్రయత్నం చేయాలి. అయితే రేట్లయినా తగ్గించాలి. లేకపోతే రేట్లు ఎందుకు పెంచవలసి వచ్చిందో ఆందోళనకారులకు వివరించే ప్రయత్నమైనా చేయాలి. రెండూ చేయకుండా ఈ అంశంతో ఏ సంబంధమూ లేని పోలీసులను రంగంలోకి దించి మీరూ మీరూ చూసుకోండన్నట్టు పరిష్కారం వాళ్లకు వదిలేస్తే ఎలా?

ప్రజల నిరసనతో కూడా ప్రభుత్వాలు ప్రజాస్వామికంగానే వ్యవహరించాలి. విద్యుత్ చార్జీలతో పాటు లాఠీచార్జీల్ని కూడా పెంచితే సమస్య పరిష్కారమవుతుందనుకోవడం తెలివితక్కువ. రెండింటికీ నిరసన తెలియచేద్దాం రండి.

హైద్రాబాద్
07-08-2000

-మానవహక్కుల వేదిక
(HRF)